# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 14 సంచిక: 10 | వరంగల్, 9-6-2026, మంగళవారం | పేజీలు: 8 | వెల: 1.00


## ఊర్లోని పిల్లలంతా సర్కార్ బడికే..

–బాల్కొండ వేల రూపాయల ఫీజులతో ప్రైవేట్ పాఠశాలల వైపు పరుగులు తీస్తున్న ఈ రోజుల్లో బాల్కొండ మండలంలోని బస్సాపూర్ గ్రామం ఆదర్శంగా నిలిచింది. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని గ్రామస్తులంతా సోమవారం గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ , ప్రభుత్వ బడులనే బలోపేతం చేయాలని ,.అప్పోసొప్పో చేసి.. వేల రూపాయలు చెల్లించి తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలకు పంపిస్తున్నారు తల్లిదండ్రులు.

## రూ.లక్ష కోట్లకుపైగా విలువైన భూములను రక్షించాం: హైడ్రా కమిషనర్



హైదరాబాద్: జూన్ 8,

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా కీలక మైలురాయిని అధిగమించింది. అక్రమార్కుల చెర నుంచి గడిచిన రెండేళ్లలో రూ. లక్ష కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ స్థలాలు, చెరువుల భూములు, నాలాలను రక్షించి ప్రభుత్వానికి అప్పగించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వచ్చే ఏడాదికి రూ. 2లక్షల కోట్లు అధిగమిస్తుందని తెలిపారు. భూ మాఫియాను అడ్డుకోవాలంటే ప్రజలు, మీడియా భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు.

రెండేళ్లలో నగర ప్రజల ప్రోత్సాహంతో రూ. లక్షా 10 వేల కోట్ల విలువైన భూములను కబ్జాదారుల నుంచి విడిపించినట్లు రంగనాథ్ చెప్పారు. నగరంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను క్లెయిమ్ చేయడం, వాటిని సంరక్షించడం, పునరుద్ధరించడమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తుందని వివరించారు. ఇటీవల కోకాపేట, పుప్పాలగూడ, నార్సింగిలో హైడ్రా సిబ్బంది రూ. వేలాది కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను రక్షించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలుగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు.

## బీఆర్ఎస్ చేసిన తప్పుల్ని సరిచేస్తుంటే.. మాపై నిందలా?: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేస్తుంటే తమపై నిందలు వేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. నాజీ సిద్ధాంతాలకు సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు ఇస్తున్నారని కొందరు ప్రచారం చేయడంపై మండిపడ్డారు. హిట్లర్ సిద్ధాంతాలను పాటిస్తామని సీఎం చెప్పలేదని స్పష్టం చేశారు. ఏదైనా పని సాధించే వరకు విరమించని వాడినే హిట్లర్ అంటారని, ఏ పనినైనా పట్టుదలతో సాధించాలని సీఎం చెప్పారని అన్నారు. హైడ్రాపై వస్తున్న ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. భూ కబ్జాదారుల గుండెల్లో భయం పుట్టిస్తుంటే ఓర్వలేకపోతున్నారని అన్నారు. హైడ్రా చట్టపరిధిలోనే పనిచేస్తోందన్నారు. రాజ్యాంగం, చట్టం ప్రకారమే నోటీసులు ఇస్తుందని చెప్పారు. హైడ్రా చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని, బీఆర్ఎస్ నేతలకే ఇబ్బంది కలుగుతున్నట్లు ఉందని అన్నారు.



## డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ భూదందాలు.. సస్పెండ్ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్: హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. హౌసింగ్ బోర్డులో 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్‌పై హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన రాము నాయక్ అనేక భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా తేలిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు.. కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డు, ప్రభుత్వ స్థలాలు పరిశీలిస్తుండగా.. రాము నాయక్ భూలీలలు బయటకు వచ్చాయని మంత్రి తెలిపారు. బహిరంగ మార్కెట్లో గజం సుమారు రూ.2లక్షల ధర ఉన్న హైకోర్టు గేట్ల వద్ద హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడిందని మంత్రి తెలిపారు. హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి సస్పెండ్ అయిన ఇఫ్తాకర్ అహ్మద్ భార్య పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని.. ఆ తర్వాత 2025లో ఆ భూమి మరొకరి పేరిట మారినట్లు విచారణలో తేలిందని పొంగులేటి తెలిపారు.

భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌పై కూడా విచారణకు ఆదేశించామని మంత్రి పొంగులేటి తెలిపారు. రాము నాయిక్ భూదందాలపై 2017 నుంచే పలు కేసులు ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ పాలకులు స్పందించలేదని మంత్రి చెప్పారు. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 గజాలు, లక్ష్మీగూడలో 130 గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 గజాల స్థలాలను రాము నాయక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని.. వాటన్నింటిపై విచారణ జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కేసుల్లో సబ్ రిజిస్ట్రార్‌ల పాత్రపై విచారణ జరపాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఐజీని ఆదేశించామన్నారు. రాము నాయక్‌పై విచారణ పూర్తి చేసి అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని తెలిపారు. రాము నాయక్ భూఅక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించామని.. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా.. ఆక్రమణలకు సహకరించినా ఉపేక్షించేది లేదని, ఏ హోదాలో ఉన్నప్పటికీ నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని.. క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు.



## 'ఇండియా బ్లాక్' కీలక నిర్ణయాలు

–హైదరాబాద్: జన బంధన్ పేరుతో ఢిల్లీ వేదికగా కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీలు కీలక భేటీ నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా భేటీ విషయాలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే మీడియాకు వెల్లడించారు. పార్లమెంటులో రాజ్యాంగ (నూట ముప్పై ఒకటవ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులను ఓడించడంలో కూటమి ఐక్యతను ఖర్గే ప్రశంసించారు.

SIR, ఓట్ల దోపిడీ, ఎన్నికల దొంగతనంపై భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ పంపాలని అంగీకరించాం. ఈ లేఖను అతి త్వరలో భారత ప్రధాన న్యాయమూర్తికి అందజేయనున్నాం," అని ఆయన అన్నారు. నీట్, సీబీఎస్ఈ పరీక్షలకు హాజరైన విద్యార్థులను ప్రభావితం చేసిన అవకతవకల ఆరోపణలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణ రాజీనామాను కోరాలని ఇండియా కూటమి ఏకగ్రీవంగా తీర్మానించినట్లు కూడా ఖర్గే తెలిపారు.

"నీట్, సీబీఎస్ఈ పరీక్షలకు హాజరైన లక్షలాది మంది యువతకు ఆయన ద్రోహం చేసినందున, విద్యాశాఖ మంత్రి తక్షణ రాజీనామాను డిమాండ్ చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం," అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. యువత, సంస్థాగత సమగ్రత, మరియు నిరంతర ఉమ్మడి ప్రతిపక్ష కూటమిపై దృష్టి సారించే కూటమి తక్షణ కార్యాచరణ ప్రణాళికను ఖర్గే ప్రకటించారు. జాతీయ రాజకీయాలను సమీక్షించడానికి, వ్యూహాన్ని సమన్వయం చేసుకోవడానికి కూటమి భాగస్వాములు ఇకపై ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశమవుతారని ఆయన తెలిపారు. భారత కూటమి నాయకుల తదుపరి అధికారిక సమావేశం ఆగస్టు 8న ఖరారు చేయబడిందని, భవిష్యత్ తేదీలను ఎప్పటికప్పుడు నిర్ణయించి, తెలియజేస్తామని ఆయన చెప్పారు.

## ఫీజుల నియంత్రణ చట్టం వెంటనే అమల్లోకి తేవాలి: కవిత



హైదరాబాద్: తెలంగాణలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. నాలుగు వేల పాఠశాలలు మాత్రమే నడిపిస్తానని అంటున్న రేవంత్ రెడ్డి హిట్లర్ మాత్రమే కాదు, అంతకన్నా ఎక్కువ అని ఘాటుగా విమర్శించారు. విద్యాశాఖపై రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఉండదని సీఎం ప్రకటించిన మరుసటి రోజే అడ్మిషన్లకు ఇంటర్ బోర్డు షెడ్యూల్ ఇచ్చిందని పేర్కొన్నారు. జూనియర్ కళాశాలలు ప్రారంభమై వారం రోజులు అవుతున్నా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు ఈ ప్రభుత్వం కనీసం అఫిలియేషన్‌లు ఇవ్వలేదని ఆక్షేపించారు.

డిగ్రీ అడ్మిషన్లను గందరగోళంగా మార్చేశారన్న కవిత.. ఉన్నత విద్యా మండలి కొన్ని కోర్సులను సిఫార్సు చేస్తే, కమిషనరేట్ మరికొన్ని కోర్సులు రిఫర్ చేసిందని తెలిపారు. వాటిలో ఏ ఒక్క కోర్సుకు కూడా యూనివర్సిటీలు అప్రూవల్ ఇవ్వలేదని.. అయినా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని కవిత అన్నారు. గురుకులాల్లో వంద మందికి పైగా విద్యార్థులు చనిపోయినా ఈ సీఎం కనీసం సమీక్ష చేయట్లేదని, రూ.11 వేల కోట్ల ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. జీవో 7ను రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం వెంటనే అమల్లోకి తెచ్చి ప్రైవేటు స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు.

## విదేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించేందుకు యత్నిస్తున్నాం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

"గతంలో రూ.1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

భారతశక్తి

## డిజిటల్ తో పాటు క్యాష్ ట్రాన్సక్షన్స్...

పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. అయితే చాలామంది ఆర్థికవేత్తలు డిజిటల్ చెల్లింపుల వల్ల నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గిపోయాయని.. మామూలు టీ షాప్ నుంచి కార్పొరేట్ హోటల్ వరకు అన్నింట్లోనూ డిజిటల్ విధానంలో చెల్లింపులు జరుగుతున్నాయని చెబుతున్నారు. కానీ డిజిటల్ యుగంలో కూడా పాత పరిస్థితే ఉంది. చదువుతుంటే ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఇప్పటి కాలంలో డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. అలాగని నగదు చెల్లింపులు తగ్గుముఖం పట్టలేదు. దేశంలో చలామణి అవుతున్న నగదు లెక్కలు ఇదే విషయాన్ని తేడా తెలియచేస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 10 సంవత్సరాల కాలంలో ఇది మూడు రెట్లు పెరిగింది. 2017 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా నగదు చలామణి 13 లక్షల కోట్లు ఉండేది.. 2026 ఆర్థిక సంవత్సరానికి అదేకంగా 41 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ఏటీఎం నెట్వర్క్ మాత్రం దారుణంగా పడిపోయింది. 2023లో 2.19 లక్షలకు పైగా ఏటీఎం యంత్రాలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 2.09 లక్షలకు పడిపోయింది. నగదు ఉపసంహరణలు కూడా 32.6 లక్షల కోట్ల నుంచి 28.6 లక్షల కోట్లకు పడిపోయాయి. ఏటీఎంల సంఖ్య పడిపోవడంతో నగదును ఉపసంహరించుకోవడానికి చాలామంది ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకుల నుంచి ఏటీఎంలోకి వచ్చే నగదు పడిపోయిందని తెలుస్తోంది.. మార్చి, ఏప్రిల్ నెలల్లో.. మన దేశ వ్యాప్తంగా ఏటీఎంలో స్టోర్ చేసేందుకు 94 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. మార్చి నెలలో 61 వేల కోట్లు.. ఏప్రిల్ నెలలో 54 వేల కోట్లు మాత్రమే సమకూర్చారు. ఇక కేంద్రీకృత బ్యాంకు నివేదిక ప్రకారం గడిచిన నెల 22 నాటికి దేశంలో మొత్తం 42.54 లక్షల కోట్ల నగదు చలామణిలో ఉందని తెలుస్తోంది. ఇక ఏటీఎం లావాదేవీలు గత ఏడాదితో పోల్చి చూస్తే 10.4% తగ్గింది. ప్రజలు డిజిటల్ చెల్లింపుల వైపు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం విచిత్రంగా ఉంది. డిజిటల్ తో పాటు నగదు లావాదేవీలు కూడా ప్రజలు నిర్వహిస్తున్నారు. అందువల్ల క్యాష్ స్పెక్యులేషన్ కూడా విపరీతంగా ఉంది. అయితే వచ్చే రోజుల్లో ఇది తగ్గే అవకాశం ఉంటుందా... పెరుగుతుందా.. అనే విషయాలను ఇప్పుడే చెప్పలేమని ఆర్థిక నిపుణులు అంటున్నారు.రతదేశంలో ప్రస్తుతం నగదు వ్యవహారాలకంటే డిజిటల్ చెల్లింపులే ఎక్కువగా మారాయి. కిరాణం షాపు నుంచి పెద్ద పెద్ద చెల్లింపులు ఆన్ లైన్ లోనే జరుగుతున్నాయి. అయితే డిజిటల్ చెల్లింపులు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గడం లేదని కొన్ని నివేదికలను బట్టి తెలుస్తోంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం.. గత పదేళ్లలో చలామణిలో ఉన్న నగదు దాదాపు మూడు రెట్లు పెరిగింది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థలో నగదుకు ఎంత ప్రాధాన్యం ఉందో తెలుస్తోంది. ఆర్ బీఐ లెక్కల ప్రకారం 2017 ఆర్థిక సంవత్సరంలో దేశంలో చలామణిలో ఉన్న నగదు విలువ సుమారు రూ. 13 లక్షల కోట్లు. అయితే 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది రూ. 41 లక్షల కోట్లకు చేరింది. యూపీఐ, మొబైల్ వాలెట్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపు పద్ధతులు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ నగదు అవసరం తగ్గకపోవడం విశేషం.ఒకవైపు నగదు చలామణి పెరుగుతుండగా.. మరోవైపు ఏటీఎం నెట్‌వర్క్ క్రమంగా తగ్గుతోంది. 2023లో దేశవ్యాప్తంగా 2.19 లక్షలకు పైగా ఏటీఎంలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య సుమారు 2.09 లక్షలకు పడిపోయింది. బ్యాంకులు నిర్వహణ ఖర్చులు తగ్గించడం, డిజిటల్ లావాదేవీలపై ఎక్కువ దృష్టి పెట్టడం వంటి కారణాలు దీనికి ప్రధానంగా చెప్పబడుతున్నాయి. ఇదే సమయంలో ఏటీఎంల ద్వారా నగదు ఉపసంహరణలు కూడా క్రమంగా తగ్గుతున్నాయి. 2023లో ఏటీఎంల నుంచి సుమారు ?32.6 లక్షల కోట్ల నగదు ఉపసంహరించగా, ప్రస్తుతం అది ?28.6 లక్షల కోట్లకు తగ్గింది. అంటే ప్రజలు నగదును పూర్తిగా వదిలేయకపోయినా, అవసరమైనప్పుడు మాత్రమే తీసుకుంటూ రోజువారీ లావాదేవీలకు డిజిటల్ వద్ద తులను ఎక్కువగా వినియోగిస్తున్నారని అర్థమవుతోంది.యూపీఐ విప్లవం భారత ఆర్థిక వ్యవస్థలో పెద్ద మార్పును తీసుకొచ్చింది. చిన్న టీ దుకాణం నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు క్యూ ఆర్ కోడ్ చెల్లింపులు సాధారణమయ్యాయి. దీంతో చిన్న మొత్తాల కోసం లకు వెళ్లాల్సిన అవసరం తగ్గిపోయింది. ఫలితంగా ఏటీఎంల వినియోగం తగ్గినా, అత్యవసర పరిస్థితులు, గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపార లావాదేవీల కోసం నగదు డిమాండ్ మాత్రం కొనసాగుతోంది.

# పార్టీలకతీతంగా భూ దందాలు

నెల్లూరు, జూన్ 8,

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కావలి నియోజకవర్గంలో రకరకాల భూ దందాలు జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఔట్స్ వేశారు. అప్పటి అధికారులను మేనేజ్ చేసుకుని మరికొందరు ప్రభుత్వ, కాలువ భూములను పట్టా భూములుగా చూపించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దానికి సంబంధించి అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ప్రధాన అనుచరుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి మీదే ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. ఆయనతో పాటు మరో నలుగురు వేసిన లేఔట్లపై కూడా ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు జరుగుతోంది. అధికారులు లోతుల్లోకి వెళ్ళి దర్యాప్తు చేస్తుండటంతో అక్రమార్కులకు వణుకు పుడుతోందట. ఆ క్రమంలోనే? వాళ్ళు సరికొత్త ఆలోచనలకు పదునుపెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం కలకలం రేపుతోంది. గత ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి గెలిచాక వైసీపీ హయాంలో వేసిన అక్రమ లేఔట్లపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే ఇటీవల ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అది తుది దశకు చేరుకుందనుకుంటున్న సమయంలో దర్యాప్తు అధికారుల మీద దౌర్జన్యాలు జరగడం కలకలం రేపుతోంది. వీటి వెనక స్థానిక టిడిపి నేతలు ఉన్నారన్న మాటలతో ఇంకా షాకవుతున్నారట స్థానికులు. అసలు అక్రమ లేఔట్లపై దర్యాప్తు ప్రారంభించిన విజిలెన్స్ అధికారులకు మొదట రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సహకరించలేదట. రికార్డులు ఇచ్చేందుకు కూడా కింది స్థాయి అధికారులు ఆసక్తి చూపలేదని తెలిసింది.చివరికి కలెక్టర్ ఆదేశాలతో రికార్డులు తెప్పించుకున్న విజిలెన్స్ అధికారులు సుమారు 78 లేఅవుట్లను పరిశీలించారు. ఇందులో చాలావరకు అక్రమాలు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో బయటపడిందని అంటున్నారు. ముగ్గురు వ్యక్తులు అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని సుమారు 300 ఎకరాల్లో అక్రమ లేఔట్లు వేసినట్టు ప్రాథమిక అంచనాకి వచ్చారట. ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు కూడా చేశారని.. వాటి విలువ ఇప్పుడు 100 కోట్లకు పైనే ఉంటుందని దర్యాప్తు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో.. దీని నుంచి తప్పించుకునేందుకు అప్పట్లో అక్రమాలకు పాల్పడ్డ వాళ్ళంతా ఇప్పుడు టిడిపి ద్వితీయ శ్రేణి నేతలతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారన్న ప్రచారం కావలిలో కాక రేపుతోంది. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల బండారం విజిలెన్స్ ఎంక్వయిరీలో బయటపడుతూ ఉండడంతో ?వాళ్ళంతా ఉలిక్కిపడుతున్నారట. ఎలాగైనా దర్యాప్తును అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో అధికార పార్టీ నేతలకు టచ్ లోకి వెళ్లినట్టు చెప్పుకుంటున్నారు. ఆ టచ్చింగ్స్ కారణంగానే?. కావలి ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామకృష్ణ? విజిలెన్స్ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని సొంత పార్టీలోనే మాట్లాడుకుంటున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితంగా ఉన్న కీలక నేత ఒకరు.. ఇప్పుడు టిడిపి నేతలకు వెనకుండి గైడ్ చేస్తున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే అక్రమ లేఔట్లకు సంబంధించిన సూత్రధారులను గుర్తించిన విజిలెన్స్ అధికారులు.. వారికి సహకరించిన రియలెస్టేట్ బ్రోకర్స్, డాక్యుమెంట్ రైటర్ల వివరాలు సేకరిస్తున్నారట. దొరికిన వాళ్ళ నుంచి స్టేట్మెంట్స్ రికార్డు చేసే వ్యవహారం కూడా నడుస్తోందని అంటున్నారు.అయితే విజిలెన్స్ విచారణకు సహకరించొద్దంటూ బ్రోకర్లు, డాక్యుమెంట్ రైటర్స్‌ను కూడా నదరు నదరు కీలక నేతే బెదిరిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. దర్యాప్తు పూర్తి చేసి నెలాఖరులోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులు గట్టిగా పనిచేస్తుంటే.. అది పూర్తయితే తమపై క్రిమినల్ కేసులు పెట్టే ప్రమాదం ఉందని అక్రమార్కులు భయపడుతున్నారట. అందుకే? ఎంక్వయిరీని ఆలస్యం చేసేందుకు.. స్థానిక ద్వితీయ శ్రేణి టిడిపి నేతలను రెచ్చగొట్టి అధికారులు మీదకు పంపుతున్నారన్నది లోకల్ టాక్. మా లేఔట్స్ మీద విచారణ చేసే అధికారం ఎవరిచ్చారంటూ విజిలెన్స్ అధికారులను బెదిరించడం కూడా టిడిపి ద్వితీయ శ్రేణి నేతల ప్లాన్ లో భాగమేనని, అక్రమార్కులే తెరవెనుక ఉండి వాళ్లని పురమాయిస్తున్నారన్న ప్రచారం కావలిలో జరుగుతోంది. టీడీపీ నాయకులు దాడి చేసిన వ్యవహారాన్ని ఇప్పటికే విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారట. సదరు నేతపై కేసు నమోదు చేసినప్పటికీ దీనికి సంబంధించి అటు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గానీ.. జిల్లా అధ్యక్షులు, అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గానీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని సొంత పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. ఇన్ని ఆటంకాల మధ్య అక్రమ లేఔట్స్‌పై విజిలెన్స్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందా..? అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెడతారా అనేది ఉత్కంఠ గా మారింది.

# అమరావతి కోసం వైసీపీ లీగల్ ఫైట్...

విజయవాడ,జూన్ 8,

అమరావతిలో రాజధాని నిర్మాణం ఒక ఎత్తయితే? అందుకోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలు మరోఎత్తు. ఒకవైపు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే? ఇంకోవైపు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు, రెండో విడత భూ సమీకరణకు సంబంధించిన సమస్యలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. సరిగ్గా ఇక్కడే కొత్త అస్త్రాలకు పదును పెడుతోందట ప్రతిపక్ష పార్టీ. బాధిత రైతుల తరఫున వైసీపీ డైరెక్ట్‌గా యాక్షన్‌లోకి దిగే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తోంది. దానికి సంబంధించి ఆగమేఘాల మీద పార్టీ తరఫున ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడమే ఇందుకు ఉదాహరణ అంటున్నారు పరిశీలకులు. రాజధాని ప్రాంతానికి చెందిన కొందరు రైతులు తాజాగా వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను కలిశారు. వాళ్ళు తమ సమస్యల్ని చెప్పిన వెంటనే పార్టీ కమిటీలు ఏర్పాటవడం చూస్తుంటే? ఈ విషయంలో విపక్షం ఎంత సీరియస్‌గా ఉందో అర్థమవుతోందని అంటున్నారు ఈ వ్యవహారాలను దగ్గరగా గమనిస్తున్న వాళ్ళు. అమరావతి రైతుల సమస్యల్ని క్షేత్రస్థాయి పరిశీలించడం కోసం పార్టీ తరఫున కీలకమైన సీఆర్డీఏ కమిటీ ఏర్పాటైంది. బలవంతపు భూ సమీకరణకు తాము వ్యతిరేకమని... తాము అధికారంలోకి వచ్చాక అవసరమైతే భూముల్ని తిరిగి ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తామని జగన్ చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.ప్రభుత్వం చెబుతున్నట్టు అమరావతిలో అంతా పారదర్శకంగా ఏమీ లేదని, చాలా మందికి తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే వైసీపీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందని అంటున్నారు. 400 మందికి పైగా రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇంకా కేటాయించాల్సి ఉందని చెప్పుకుంటున్నారు. కొన్ని భూములపై కోర్టు కేసులు కొనసాగుతుండగా... వాటి పరిష్కారం తర్వాతే ప్లాట్లు కేటాయిస్తామని అంటోందట ప్రభుత్వం. లంక భూములకు సంబంధించిన సమస్యలు కూడా ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని తెలుస్తోంది. రెండు వేలకుపైగా ప్లాట్లు వివిధ కోర్టు వివాదాల్లో ఉన్నాయనే చర్చ కూడా జరుగుతోంది. ఇలా అధికారికంగా వెలుగులోకి వచ్చిన సమస్యలతో పాటు.. బయటకు రాని ఇబ్బందులు కూడా చాలానే ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కోర్టులకు వెళ్లే స్తోమత లేక.. ప్రభుత్వాన్ని ఎదిరించే ధైర్యం చాలని చాలామంది రైతులు తమ సమస్యలను బయటపెట్టలేకపోతున్నారని వైసీపీ నేతలు గుర్తించినట్టు సమాచారం. అలాంటి వారికి అండగా ఉండి న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల వైసీపీ అధ్యక్షులు పేర్ని నాని, అంబటి రాంబాబులతో పాటు దేవినేని అవినాష్, లేళ్ళ అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, నందిగం సురేష్, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాల వజ్రబాబులకు ఈ కీలక కమిటీలో చోటు కల్పించారు. కోర్టుల్లో పోరాడేందుకు పార్టీ లీగల్ సెల్ నుండి పొన్నవోలు సుధాకర రెడ్డి లాంటి వాళ్ళను కూడా రంగంలోకి దించారు. ఇప్పటివరకు రాజధాని విషయంలో అధికార కూటమి వాదనలే ఎక్కువగా వినిపించాయని, అందుకే రైతుల సమస్యల పేరుతో వైసీపీ ప్రత్యామ్నాయ వేదికను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. మొదటి విడతలో రిటర్నబుల్ ప్లాట్లు అందని రైతులు, రెండో విడత భూ సమీకరణలో సమస్యలు ఎదుర్కొంటున్న వాళ్ళు, కోర్టుల చుట్టూ తిరగలేని బాధితులు.. ఇలా అన్ని వర్గాల వాళ్ళను సపోర్ట్ చేయడమే ప్రతిపక్ష పార్టీ అజెండాగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో అమరావతి రైతులు ఏం కోరుకుంటే అది చేస్తాం.. బలవంతపు భూసేకరణ అనేదే ఉండదు.. అవసరమైతే భూములు వెనక్కు ఇస్తాం. ప్రస్తుతానికి మనం చేయగలిగింది న్యాయ పోరాటం మాత్రమేనన్న జగన్ మాటల చుట్టూ గట్టి చర్చలే జరుగుతున్నాయి. ఇదే సమయంలో తమ మాదిగన్ ప్రతిపాదన అయితే అమరావతి ప్రాంత రైతుల నుంచి మరోసారి భూములు తీసుకోవాల్సిన అవసరం ఉండదన్న వాదనను తెరపైకి తెస్తోంది వైసీపీ. మొత్తం మీద అమరావతి రైతుల సమస్యలను కేంద్రంగా చేసుకుని వైసీపీ లీగల్ అస్త్రంతో డైరెక్ట్ వార్ డిక్లేర్ చేసినట్టేనన్నది విశ్లేషకుల అభిప్రాయం. భూ సమీకరణ బాధితులకు అండగా నిలవడం ద్వారా రాజధాని పేరుతో ప్రభుత్వానికి వస్తున్న మైలేజీకి బ్రేకులు వేయాలన్నది విపక్షం స్కెచ్‌గా కనిపిస్తోంది. మరి ఈ లీగల్ ఫైట్‌కు రైతులు కలిసి వస్తారా?? కూటమి ప్రభుత్వం ఎలాంటి కౌంటర్ ఉంటుందోనన్న ఆసక్తి పెరుగుతోంది పొలిటికల్ సర్కిల్స్‌లో.

## దేవీపట్నం మండలంలో కొనసాగుతున్న పులి సంచారం

ఏలూరు న్ 8,

దేవీపట్నం మండలం నెలకోట ఉ పూడిపల్లి సొరంగం వద్ద పులి సంచారం కొనసాగుతోంది. అటవీశాఖ, హనుమాన్ ప్రత్యేక బృందాలు రాత్రంతా నిఘా కొనసాగించాయి. క్షేత్రస్థాయిలో బృందాలకు ఉన్నతాధికారులు మార్గనిర్దేశం చేస్తున్నారు. × బెంగళూరు నుంచి వచ్చిన వన్యప్రాణి నిపుణుల బృందం ఆపరేషన్ లో భాగస్వామ్యమైయింది. రాత్రివేళ బయటకు ఒంటరిగా వెళ్లొద్దని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు సూచించారు.

## విశాఖలో యువకుడి దారుణ హత్య

విశాఖపట్నం న్ 8, విశాఖపట్నం మురళీ నగర్ మసీదు సెంటర్ సమీపంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నడిరోడ్డుపై కత్తులతో దాడి జరిగింది. బాధితుడు కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాత కక్షల నేపథ్యంలో సాలిపేటకు చెందిన వరుణ్ ( 35 ) హత్య కు గురైయాడు. నిందితులు పరారీలో ఉన్నారు. పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

## రేవంత్ రెడ్డి సభలో రియల్టర్ల నిరసన

ఉప్పల్ న్ 8, ఆదివారం రాత్రి జరిగిన ఉప్పల్ భగాయత్ రేవంత్ రెడ్డి సభలో ప్లకార్డుల ప్రదర్శన కలకలం రేపింది. నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్కు తరలించారు. లీగల్గా ఉన్న భూములను నిషేధిత జాబితాలో పెట్టారని.. వెంటనే ఆ భూములని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసనకు దిగారు.

# కార్గో వ్యతిరేక ఉద్యమం...

శ్రీకాకుళం,జూన్ 8

అసెంబ్లీ ఎన్నికల్లో పలాస నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు గౌతు శిరీష. ఇప్పుడు ఆమెకే నియోజకవర్గంలో సరికొత్త సమస్యలు ఎదురవుతున్నాయట. పార్టీ పవర్‌లో ఉండటం, తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన, జిల్లా వాసి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ఉండటంతో పలాసకు ఓ మంచి ప్రాజెక్ట్ తీసుకురావాలని భావించారట ఎమ్మెల్యే. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయటంతో పాటు ఉపాధి అవకాశాలు సృష్టించేలా ప్రాజెక్ట్ కోసం ప్రయత్నించారామె. ఆ క్రమంలోనే పలాస ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ పెట్టాలని నిర్ణయించారు. ఇక్కడికి ఆ ప్రాజెక్ట్ వస్తే ఉద్దానం ప్రాంతం అభివృద్ధి అవుతుందంటూ ప్రచారం మొదలు పెట్టారు. అందుకు అవసరమైన భూ సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేగా గౌతు శిరీష కూడా స్థానికులతో మాటాడే ప్రయత్నం చేస్తున్నారట. కానీ పాలకులు చెబుతున్న అభివృద్ధి మాటల్ని స్థానికులు విశ్వసించడం లేదు. పైగా పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక ఉద్యమం మొదలైంది. మాకసలు అది వద్దే వద్దంటూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారట.కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సమావేశాల్లో సైతం మా ప్రాంతానికి కార్గో ఎయిర్‌పోర్ట్ అవసరం లేదని చెప్పేస్తున్నారు. అందుకు వాళ్ళ రీజన్స్ వాళ్ళకు ఉన్నాయి. పెద్దగా ఉపాధి అవకాశాలు ఇవ్వని కార్గో ఎయిర్ పోర్టు కోసం వేలాది ఎకరాల్లో ఉన్న జీడి, కొబ్బరి, మామిడి తోటల్ని పణంగా పెట్టలేమన్నది స్థానిక రైతుల మాట. దీని గురించే ఇప్పుడు పలాసతో పాటు శ్రీకాకుళం జిల్లాలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలోని పల్లెల్లో చాపకింద నీరులా కార్గో వ్యతిరేక ఉద్యమం విస్తరిస్తోంది. పచ్చని తోటల్ని కొట్టివేయడం తమకు ఇష్టం లేదని అంటున్నారు రైతులు. కొందరైతే కాస్త డిఫరెంట్‌గా, ఇంకాస్త గట్టిగా తమ వాదన వినిపిస్తున్నారు. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యాక్టరీ లాంటిది ఏదైనా వస్తే? ఇష్టం లేకున్నా? భవిష్యత్ కోసం భూములు ఇస్తాంగానీ. కేవలం కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో పరిమితమైన ఉపాధి దక్కుతుందంటే అలాంటి ప్రయోజనం లేని త్యాగాలకు మేం సిద్ధంగా లేమని తెగేసి చెబుతున్నారు. పైగా మా భూమిని లాక్కుని భూ బ్యాంక్ సిద్ధం చేసుకుంటామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని అంటున్నారు.ఈ వ్యవహారం మొత్తం అటుచేరి ఇటు చేరి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషకు చుట్టుకుంటోందట. దశాబ్దాలుగా గౌతు ఫ్యామిలీకి అండగా నిలుస్తున్నారు ఇక్కడి ప్రజలు. సర్దార్ గౌతు లచ్చన్నకు ఉన్న పేరు గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు. ఆయన కుమారుడు గౌతు శివాజీ సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేయటంతో పాటు, మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కానీ? శివాజీ కుమార్తె అయిన శిరీషకు రాజకీయ పరిణితి లోపించిందని, ప్రజల మనోగతాన్ని తెలుసుకోలేకపోతున్నారన్న మాటలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా వెళితే? వాళ్ళకు మంచి చేయాలనుకోవడం ఏమోగానీ? భవిష్యత్‌లో ఇబ్బందులు మాత్రం తప్పవంటూ టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులే హెచ్చరిస్తున్నారు. దీనిపై వైసీపీ కూడా ప్రశ్నాస్త్రాలు సంధిస్తోంది. మూలపేట పోర్ట్ దగ్గర వేలాది ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నప్పుడు దానికి దగ్గర్లోనే? ఇలా మరో భూ సేకరణ అవసరమా అన్నది క్వొశ్చన్. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే కూడా ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్టు తెలుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా? తమ ప్రాంతానికి వచ్చిన ప్రాజెక్ట్ విషయంలో అడుగు ముందుకేయాలా? లేక ప్రజాభీష్టం పేరుతో ఆపేయాలో అర్థంగాక గందరగోళంలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

==========================

# కర్నూలులో వైసీపీ వర్సెస్ వైసీపీ

కర్నూలు,జూన్ 8,

కర్నూలులో అధికార పార్టీ, ప్రతిపక్షం పోరు కాస్త..వైసీపీ వర్సెస్ వైసీపీ అన్నట్టు మారిపోయింది. టీడీపీలోని ఒక వర్గం పరోక్షంగా ప్రతిపక్ష నేతల మధ్య మంట పెట్టిందనే ప్రచారం జరుగుతున్న వేళ..కర్నూలు వైసీపీలో అంతర్గత పోరు వీధికెక్కుతోంది. ఏకంగా సోషల్ మీడియా వేదికగా నాయకులు దుమ్మెత్తి పోసుకోవడం హాట్ టాపిక్ అవుతుంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వైసీపీ కర్నూలు నగర అధ్యక్షుడు అహ్మద్ అలీ ఖాన్ మధ్య సోషల్ మీడియా వార్ ఒక రేంజ్‌లో నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లోనూ కర్నూలు సీటు మైనారిటీకి వెళ్తుందని ఎస్వీ మోహన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని.. టీడీపీ కన్న వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ వర్గం తనపై కక్ష కట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు అహ్మద్ ఖాన్వారం పది రోజుల క్రితం కర్నూలు వేదికగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎస్వీ మోహన్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మధ్య మాటలు మంటలు చెలరేగాయి. అవి అలా చల్లారాయో లేదో ఇప్పుడు వైసీపీలో అంతర్గత పోరు కాక రేపుతోంది. పార్టీ కర్నూలు నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడితో, ఎస్వీ మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా ఫోన్‌లో మాట్లాడిన మాటలు ఇప్పుడు బయటికి వచ్చాయి. వాయిస్ రికార్డ్ చేసిన ఐటీడీపీ ప్రతినిధి దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అంతకు ముందు కర్నూలులో ఎస్వీ మోహన్ రెడ్డి, జక్కంపూడి రాజా, బైరెడ్డి సిద్ధార్థ్రెడ్డి చేసిన ఆందోళన విషయంలో కూడా అహ్మద్ ఖాన్ ఎస్వీకి వ్యతిరేకంగా కామెంట్స్ చేశారు. ఆయన వైసీపీలో వెనుకబడ్డారని, దాన్ని నిలబెట్టుకోడానికి నానా తంటాలు పడుతున్నాడని అహ్మద్ ఖాన్ అన్నట్లుగా చెబుతున్నారు.కర్నూలులో వైసీపీ చేపట్టిన ఆందోళనలో జక్కంపూడి రాజా, బైరెడ్డి సిద్ధార్థ్రెడ్డి మాత్రమే హైలైట్ అయ్యారంటూ ఐటీడీపీ ప్రతినిధితో ఫోన్ కన్వర్జేషన్‌లో మాట్లాడారు వైసీపీ నగర అధ్యక్షుడు అహ్మద్ ఖాన్. ఎస్వీ మోహన్ రెడ్డి వన్ మ్యాన్ షో చేస్తున్నారంటూ సొంత పార్టీ నేతపై నెగెటివ్ కామెంట్స్ చేశారాయన. సరిగ్గా ఈ పాయింట్స్‌నే తమకు అనుకూలంగా మల్చుకునేందుకు టీడీపీ వ్యూహాలు రచిస్తోంది. వైసీపీలో అంతర్గత విభేదాలు గట్టిగా ఉన్నాయని ప్రొజెక్ట్ చేస్తూ..ఆడియో రికార్డ్‌ను పోస్ట్ చేసింది టీడీపీ సోషల్ మీడియా టీమ్. ఇదే ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలో మంటలు పుట్టిస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడికి వ్యతిరేకంగా కర్నూల్ నగర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలతో క్యాడర్లో అయోమయ పరిస్థితి ఏర్పడింది. అటు ఎస్వీకి చెందిన సోషల్ మీడియా టీమ్ కూడా అహ్మద్ అలీఖాన్ పేరు ప్రస్తావించకుండా కొన్ని పోస్ట్‌లు పెట్టడం కలకలం రేపుతోంది. మరికొందరు సోషల్ మీడియాలోనే అహ్మద్ అలీఖాన్‌ను నిలదీస్తున్నారు.కర్నూలు వైసీపీలో ముగ్గురు కీలక నేతలు యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, హాఫీజ్ ఖాన్, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ మూడు గ్రూప్‌లు విడిపోయి యాక్టివిటీ నడిపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్ళు హాఫీజ్ ఖాన్, ఎస్వీ మోహన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా పోరు మాత్రం ఆగడం లేదు. అది చాలదన్నట్లుగా అహ్మద్ ఖాన్ వాయిస్ రేజ్ చేయడంతో పాటు ఆయన ఆడియో కాల్ టీడీపీ సోషల్ మీడియా టీమ్‌కు చిక్కడం మరింత చర్చనీయాంశంగా మారింది. రాయలసీమకు ముఖద్వారంగా ఉన్నా కర్నూలు వైసీపీలో నడుస్తున్న అంతర్గత పోరుపై పార్టీ అధిష్టానం ఎలా రియాక్ట్ అవుతుందో వేచి చూడాలి మరి.

# లారెన్స్ పొలిటికల్ ఎంట్రీ....

చెన్నై, జూన్ 8,

తమిళనాడు ఎన్నికల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మరో కోలీవుడ్ స్టార్ పొలిటికల్ ఎంట్రీకి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రీసెంట్‌గా ఎన్నికల్లో టీవీకే పార్టీ ఘన విజయం సాధించి స్టార్ హీరో విజయ్ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తనదైన పాలన మార్క్‌తో దూసుకెళ్తున్నారు. ఆయన పార్టీలో ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, డైరెక్టర్ రాఘవ లారెన్స్ జాయిన్ అవుతున్నారంటూ రెండు రోజులుగా ప్రచారం సాగుతోంది.ఈ రూమర్స్‌కు లారెన్స్ చెక్ పెట్టారు. సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటన చేశారు. 'నేను తిరుచ్చి ఈస్ట్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానని పలు మీడియా ప్లాట్ ఫామ్స్‌లో ప్రచారం జరుగుతోంది. నా మీడియా మిత్రులు కొందరు నాకు ఫోన్ చేసి దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ నన్ను కలవాలని అభ్యర్థిస్తున్నారు. ఈ ఊహాగానాలు పెరిగిపోయి నేను దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందని భావించినందున, ఈ విషయాన్ని మీతో పంచుకోవాలని అనుకుంటున్నా.నేను ప్రస్తుతం బెంజ్ సినిమా షూటింగ్‌లో ఉన్నాను. నా షెడ్యూల్ 10వ తేదీతో



ముగుస్తుంది. మా అమ్మగారి ఆశీస్సులతో నా జీవితానికి సంబంధించి ఓ ముఖ్యమైన నిర్ణయం 11వ తేదీ గురువారం ఉదయం 9:30 గంటలకు అనౌన్స్ చేస్తాను.' అంటూ రాసుకొచ్చారు.ఏప్రిల్‌లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి విజయ్ పోటీ చేసి రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకుని తిరుచ్చి ఈస్ట్ వదులుకున్నారు. దీంతో ఇక్కడ త్వరలోనే బై ఎలక్షన్ జరగనుంది.ఈ స్థానంలో లారెన్స్ టీవీకే తరఫు నుంచి పోటీ చేస్తారని కొన్ని రోజులుగా ప్రచారం సాగుతోంది. దీనిపైనే ఈ నెల 11న ఆయన క్లారిటీ ఇవ్వనున్నారు. మరి ఆయన విజయ్ పార్టీలో చేరి పోటీలో నిలుస్తారా మరేదైనా ప్రకటన చేస్తారా? అనేది ఆసక్తిగా మారిందిలారెన్స్ కేవలం నటనలోనే కాకుండా సామాజిక సేవలోనూ ఎప్పుడూ ముందుంటారు. తన తల్లి పేరు మీద అనాథలకు, వృద్ధులకు చేతనైన సాయం అందిస్తారు. అలాగే, మీడియాలో వచ్చిన కథనాలపైనా స్పందిస్తూ అవసరమైన వారికి తనకు తోచిన సాయం చేస్తుంటారు. ఆయన పొలిటికల్ ఎంట్రీ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

==================================

# సైలెంట్ మూడ్ లోకి ఫైర్ బ్రాండ్లు

కడప,జూన్ 8,

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక వింత వాతావరణం కొనసాగుతోంది. ఎవరి వల్ల పార్టీకి చెడ్డ పేరు వచ్చిందో.. వారు ఇప్పుడు యాక్టివ్ అవుతున్నారు. పార్టీలో సీనియర్లు సైలెంట్ అవుతున్నారు. ఈ భిన్న వాతావరణంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. 2019 నుంచి 2024 మధ్య కొంతమంది నేతల వ్యవహార శైలితోనే పార్టీకి ఈ రకమైన ఇబ్బందులు వచ్చాయి. ప్రారంభంలో వారి మాటలు గొప్ప ఫ్యాషన్ గా అనిపించాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సైతం ఆకర్షించాయి. కానీ రాను రాను ఆ నేతల తీరుతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పతనస్థితికి చేరుకుందనేది పార్టీ క్యాడర్ కు తెలిసింది. పార్టీలో సీనియర్లు మౌనం వహించి.. దూకుడు కలిగిన నేతలు మాటలు పార్టీకి చేటు తెచ్చాయి అని ఆలస్యంగా తెలిసింది. అప్పటికే మూల్యం చెల్లించుకుంది పార్టీ. అయితే ఇప్పుడు క్యాడర్ తెలుస్తుంది కానీ.. నాయకత్వం తెలుసుకోకపోవడం పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్లుగా గుర్తింపు సాధించారు కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్, పేర్ని నాని, అంబటి రాంబాబు, ఆర్కే రోజా, జోగి రమేష్, గుడివాడ అమర్నాథ్, సిదిరి అప్పలరాజు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది జూనియర్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడే వారు. వారి మాటలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎంతో ఇష్టంగా ఉండేవి. అయితే వారి మాటలు తటస్థులతోపాటు విద్యాధికులపై విపరీతంగా ప్రభావం చూపించాయి.

దాని ఫలితమే 2024 ఎన్నికల్లో దారుణ పరాజయంవైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేటు తెచ్చిన ఆ దూకుడు నేతలను జగన్మోహన్ రెడ్డి పక్కన పెట్టినట్లు కనిపించారు ప్రారంభంలో. గత అనుభవాల దృష్ట్యా సీనియర్ల సేవలను వినియోగించుకుంటానని జగన్ చెప్పుకొచ్చారు. అందుకు తగ్గట్టుగానే సీనియర్లుగా ఉన్న ధర్మాన, బొత్స లాంటి నేతలు మాట్లాడడం ప్రారంభించారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని అంతా భావించారు. కానీ ఆ సరదా ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. ఎవరైతే బూతులు మాట్లాడారో.. అడ్డగోలుగా వ్యవహరించారో.. అటువంటి నేతలు మళ్లీ తెరపైకి వస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి వారికి ప్రాధాన్యమిస్తున్నట్టు కనిపిస్తున్నారు. దీంతో సీనియర్లుగా ఉన్న ధర్మాన లాంటి వారు మళ్లీ మౌనం పాటిస్తున్నారు. ఇలా అయితే కష్టమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిట్టూరుస్తున్నారు.

# లద్దాక్ కు పోటెత్తున్న టూరిస్టులు

శ్రీనగర్ జూన్ 8

వేసవిలో టూరిస్ట్ ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. అయితే మన దేశంలో అందమైన కశ్మీర్‌లోని పహల్గాంలో గతేడాది జరిగిన ఘటనలో పర్యాటకులు కాస్త తగ్గారు. కానీ కేంద్రం, ఆర్మీ తీసుకున్న రక్షణ చర్యలతో ఈ వేసవిలో లద్దాక్‌కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఈ మే నెలలో మొత్తం 72,834 మంది పర్యాటకులు లద్దాక్‌ను సందర్శించారు. గత ఏడాది మే నెలలో 32,927 మంది మాత్రమే వచ్చిన విషయాన్ని పోలిస్తే ఇది 121.2% అద్భుత పెరుగుదల. లద్దాక్ టూరిజం చరిత్రలో ఇది ఒక నిజమైన మైలురాయి. జనవరి నుంచి మే వరకు మొత్తం 1,17,546 మంది సందర్శకులు వచ్చారు. గతేఏడాది అదే కాలంతో పోలిస్తే 43.65% వృద్ధి. ఇందులో దేశీయ పర్యాటకుల సంఖ్య 1,10,585 (45.9% పెరుగుదల), విదేశీయులు 6,961 (15.5% పెరుగుదల). లద్దాక్ ఆర్థిక వ్యవస్థలో టూరిజం ఎంత కీలక పాత్ర పోషిస్తోందో స్పష్టంగా చెప్పే సంకేతాలు.లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఈ వృద్ధిని సమర్థించడమే కాకుండా, టూరిజం రంగానికి స్థానికులకు ఉపాధి కల్పించే ముఖ్యమైన ఇంజిన్‌గా అభివర్ణించారు. ఆయన నాయకత్వంలో గత కొన్ని నెలల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయి. హోటల్స్, హోమ్‌స్టేలు, టూర్ ఆపరేటర్ల కోసం ఏకీకృత, సరళీకృత రిజిస్ట్రేషన్ విధానం, టూరిజం యూనిట్లకు "ఇండస్ట్రీ" స్టేటస్ ఇవ్వడం

కాంప్లయన్స్ భారం తగ్గించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించాయిఈ సంస్కరణలు స్థానిక యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాయి. హోమ్‌స్టేలు, ట్రాన్స్‌పోర్ట్, హ్యాండిక్రాఫ్ట్, ఫుడ్ అండ్ బెవరేజెస్ రంగాల్లో ఉపాధి పెరిగింది. మెరుగైన రోడ్డు కనెక్టివిటీ, ఎక్కువ విమాన సర్వీసులు, సోషల్ మీడియా ద్వారా లద్దాక్ సౌందర్యం వైరల్ కావడం, పోస్ట్?పాండమిక్ ట్రావెల్ బూమ్ ఈ సీజన్‌ను రికార్డు స్థాయికి తీసుకెళ్లాయి. ప్రత్యేకించి మే నెలలో రోడ్లు తెరవడం, అనుకూల వాతావరణం, పర్వతాలు, సరస్సులు, మఠాలు, అడ్వెంచర్ యాత్రలు కలిపి ఒక అద్భుతమైన అనుభవాన్ని అందిస్తున్నాయి. ఈ అపూర్వ వృద్ధి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నప్పటికీ, లద్దాక్ పర్యావరణ సున్నితత్వాన్ని మరచిపోకూడదు. ఇప్పటికే పాపులర్ స్పాట్లైన పాంగాంగ్ లేక్, నుబ్రా వ్యాలీ, లే?మనాలి హైవేల్లో క్రౌడింగ్, వాస్తే మేనేజ్‌మెంట్, నీటి కొరత, వాహనాల నుంచి వచ్చే కాలుష్యం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. లద్దాక్ ఒక ఫ్రాజైల్ ఎకోసిస్టమ్. ఇక్కడ టూరిజం వృద్ధి చెందాలంటే అది సస్టైనబుల్, రెస్పాన్సిబుల్ టూరిజంగా మాత్రమే ఉండాలి. ప్రభుత్వం, స్థానికులు, టూరిజం స్టేక్‌హోల్డర్లు కలిసి పనిచేసి, క్యాపాసిటీ బిల్డింగ్, ఆఫ్?సీజన్ టూరిజం ప్రోత్సాహం, ఎకో?టూరిజం, వేస్ట్ మేనేజ్‌మెంట్, కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గించడం వంటి వ్యూహాలను అమలు చేయాలి.లద్దాక్ టూరిజం ప్రస్తుతం చూస్తున్న ఈ బూమ్ ఒక అపూర్వ అవకాశం. సరైన ప్రణాళిక, స్థానికుల పాల్గొన్నత, పర్యావరణ సంరక్షణతో కూడిన విధానాలతో ఈ వృద్ధిని మరింత స్థిరంగా, అర్థవంతంగా మార్చుకోవాలి. లద్దాక్ కేవలం ఒక టూరిస్ట్ డెస్టినేషన్ కాదు.. ఇది ఒక ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, ప్రకృతి. దానిని కాపాడుకుంటూ అభివృద్ధి చేయడమే నిజమైన విజయం.

# ఇథనాల్ ఆయిల్ వచ్చేసింది....

హైదరాబాద్, జూన్ 8,

భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇది ఇంధన రంగంలో కీలక మలుపు. కేంద్ర పెట్రోలియం మంత్రి హరదీప్ సింగ్ పురి ఢిల్లీలో ఈ?85 ఇంధనాన్ని అధికారికంగా లాంచ్ చేశారు. ఇందులో 80?85% ఇథనాల్, 14?19% పెట్రోల్ ఉంటాయి. ఢిల్లీలో దీని ధర రూ. 82.12గా నిర్ణయించారు. సాధారణ పెట్రోల్ ధరకన్నా రూ. 20 తక్కువకే ఈ?85 ఇంధనం అందుబాటులోకి వచ్చింది. ఈ?20ను షెడ్యూల్ కంటే ముందే సాధించిన భారత్, ఇప్పుడు ఉన్నత స్థాయి ఇథనాల్ బ్లెండింగ్ దిశగా ధైర్యవంతమైన అడుగు వేసింది. ఈ?85 అనేది ఫ్లెక్స్ ఫ్యూయల్ వెహికిల్స్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఇంధనం. సాధారణ కార్లు, బైకులు దీన్ని ఉపయోగించలేవు. ఇంజన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు మాత్రమే ఈ?85ను సమర్థవంతంగా ఉపయోగించగలవు. ప్రస్తుతం హీరో మోటోకార్ప్ (స్ప్లెండర్+ ఫ్లెక్స్ ఫ్యూయల్, ఏఊ డీలక్స్), సుజుకి గిక్సర్ ఎస్ఎఫ్ 250 వంటి కొన్ని మోడల్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మారుతి సుజుకి వాగన్ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ వెర్షన్‌ను త్వరలో మార్కెట్‌లోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఈ?85 ధర తగ్గడం వినియోగదారులకు తక్షణ ప్రయోజనం. కానీ నిజమైన లాభం దేశ స్థాయిలో ఉంది. ఈ?20 పాలసీ ద్వారా ఇప్పటికే రూ. 1.84 లక్షల కోట్ల విదేశీ మారక నిల్వలు ఆదా అయ్యాయని మంత్రి పురి తెలిపారు. ఈ?85 విస్తరణతో ఈ సేవింగ్స్ ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇథనాల్ దేశీయంగా ఉత్పత్తి అవుతుంది కాబట్టి క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గుతాయి, డాలర్ ఖర్చు తగ్గుతుంది. రైతులకు అదనపు ఆదాయం (పంచదార, మొక్కజొన్న, 2ఏ ఇథనాల్ ద్వారా వ్యవసాయ వ్యర్థాలు) వస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లభిస్తుంది. ఈ?85 సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే 50?60% తక్కువ కార్బన్ ఎమిషన్లను విడుదల చేస్తుంది. వాయు కాలుష్యం తగ్గడం, ఆరోగ్య సమస్యలు తగ్గడం దీర్ఘకాలిక లాభాలు. వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే రోజే ఈ ? 85ను లాంచ్ చేయడం యాదృచ్ఛికం కాదు. ఇది సవాలుతో కూడిన మార్గం. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు ఇంకా చాలా తక్కువప్రస్తుతం ఢిల్లీ?ఎన్‌సీఆర్, ముంబై, పూణే, నాగ్‌పూర్‌లో మాత్రమే 50 పెట్రోల్ బంకుల్లో అందుబాటులో ఉంది. 2026 చివరి నాటికి 500 స్టేషన్లు, 2027 నాటికి 5,000 స్టేషన్లు అన్నది లక్ష్యం. ఇంజన్ పనితీరు, మైలేజ్, శీతాకాలంలో కోల్డ్ స్టార్ట్ సమస్యలు కూడా పరిశీలించాల్సి ఉంది. ఈ?85 లాంచ్ భారత్‌ను ఇంధన దిగుమతి భారం నుంచి విముక్తి కగిలిస్తుంది. ఇది రైతు, పర్యావరణం, ఆర్థిక స్వావలంబన, శక్తి భద్రత నాలుగు లక్ష్యాలను ఏకకాలంలో సాధించే అవకాశం ఇస్తోంది. ఇది విజయవంతం కావాలంటే కేవలం లాంచ్ చేయడం సరిపోదు. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల ఉత్పత్తిని వేగవంతం చేయడం, ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను త్వరగా విస్తరించడం, వినియోగదారుల్లో అవగాహన కల్పించడం ఇవన్నీ ఒకేసారి జరగాలి.

# ట్రబుల్ షూటర్ కు వరుస ట్రబుల్స్

బెంగళూరు, జూన్ 8,

కాంగ్రెస్ పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరు పొందారు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్. ఆర్థికంగా బలవంతుడు. ఆలోచనలో ఉన్నత వంతుడు. పైగా అనేక సంక్షోభాలలో పార్టీని గట్టెక్కించాడు. పైగా సోనియాగాంధీకి అత్యంత నమ్మకమైన వ్యక్తి. అందువల్లే అంతటి సిద్ధరామయ్యను కూడా పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ డీకే శివకుమార్ కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చేసింది. శివకుమార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయనకు అంతా కూడా సానుకూలంగా ఉంటుందని.. మంత్రులు.. మిగతా ఎమ్మెల్యేలు మొత్తం సహకరిస్తారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన సీఎం పీఠాన్ని అధిష్టించిన ఒక్కరోజు వ్యవధిలోనే కష్టాలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన వరుసగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే తన కోరుకున్న శాఖ రాలేదని రామలింగారెడ్డి పదవికి రాజీనామా చేశారు. తన కోరుకున్న శాఖ ఇవ్వలేదని మరో మంత్రి మునియప్ప నిరసన తెలిపారు. తనకు చెప్పకుండా అధికారులను మార్చారని ఇంధన మంత్రి జార్జ్ అసంతృప్తిని వ్యక్తం చేశారు.. పీసీసీ పగ్గాలు తనకు అప్పగించలేదని మరొక మంత్రి సతీష్ అలక పాన్పు ఎక్కారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దారుణమైన పరాజయాన్ని చవిచూసింది. తమిళనాడులో ఐదు స్థానాలు గెలుచుకున్నప్పటికీ.. విజయ్ పార్టీకి అవసరం కాబట్టి కాంగ్రెస్ పరువు కాస్త నిలబడింది. మిగతా రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ దారుణమైన ఫలితాలను చవిచూసింది. ఒకరకంగా చెప్పాలంటే జాతీయ పార్టీ ప్రాంతీయ పార్టీ కంటే హీనంగా మారిపోతుంది. ఒకప్పుడు దేశ రాజకీయాలను మొత్తం శాసించిన హస్తం పార్టీ ఇప్పుడు ఇలా మారిపోవడం కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. దక్షిణ భారత దేశంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఉన్న రాష్ట్రాలలో కర్ణాటక అత్యంత కీలకమైనది. ఈ రాష్ట్రం మీద బిజెపి అధినాయకత్వం ఫోకస్ చేసింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా సరే గెలిచి అధికారాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తోంది. వాస్తవానికి బిజెపికి దక్కకుండా కాంగ్రెస్ పార్టీ ఇక్కడ రాజకీయాలు చేయాల్సి ఉండేది. కానీ సిద్ధరామయ్య.. డీకే శివకుమార్ మధ్య ఆధిపత్య పోరు వల్ల కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తీవ్రమైన ఇబ్బందులు పడుతోంది. అనేక రకాల చర్చల తర్వాత శివకుమార్ కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చినప్పటికీ మంత్రులు బహిరంగం గానే తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం.. రాజీనామా చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

# రాజ్యసభ ఎన్నికల కోసం పక్కా వ్యూహం

విజయవాడ,జూన్ 8,

ఏపీలో రాజ్యసభ లెక్క తేలింది. టిడిపి నుంచి ముగ్గురు.. జనసేన నుంచి ఒకరు ఖరారు అయ్యారు. టిడిపి నుంచి సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ పేరు ఖరారు చేశారు.టిడిపి అధినేత చంద్రబాబు రాజ్యసభ ఎన్నికలో పక్కా వ్యూహం అమలు చేసినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణలు, ప్రాంతాలవారీగా బ్యాలెన్స్ చేయడం, పార్టీకి ఉన్న నమ్మకమైన కేడర్ కు ప్రాధాన్యత ఇవ్వడం అనే అంశాల ఆధారంగా ఈ ముగ్గురి ఎంపిక జరిగింది. కాపు బీసీ సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిస్తూనే.. విద్యారంగంలో గుర్తింపు ఉన్న వ్యక్తులకు, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన యువనాయకత్వానికి ఈసారి పెద్దపీట వేశారు. బిజెపి, జనసేన నాయకత్వంతో మాట్లాడిన తర్వాత మాత్రమే తుది నిర్ణయం తీసుకున్నారు. ముగ్గురు ఎంపిక వెనుక పార్టీ పట్ల విధేయత దాగి ఉంది. ముఖ్యంగా ముగ్గురు నారా లోకేష్ కు అత్యంత సన్నిహితులు కావడం విశేషంసానా సతీష్ కు మరోసారి కొనసాగింపు లభించింది. గత కొంతకాలంగా పార్టీలో ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. పారిశ్రామిక వ్యాప్తంగా కూడా గుర్తింపు ఉంది. నిత్యం నారా లోకేష్ వెంట ఉండేవారు. ఆయన పాదయాత్ర చేసిన సమయంలో కూడా కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. భాష్యం రామకృష్ణ తెర వెనుక రాజకీయ సేవలు అందిస్తూ వచ్చారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా సహకారం అందించారు. మొన్నటి ఎన్నికల్లో గుంటూరు ఎంపీ టికెట్ ఆశించారు. కానీ వీలు పడలేదు. రాజ్యసభ పదవి దక్కింది. ఇక చింతకాయల విజయ్ గురించి చెప్పనవసరం లేదు. తండ్రి మాదిరిగానే దూకుడు కలిగిన నేత. ఐటీడీపీకి విశేష సేవలు అందించారు. ఆయనకు రాజ్యసభ పదవి ఇవ్వడం ద్వారా యువతకు, పార్టీ నమ్మకస్తులకు చంద్రబాబు సరైన గుర్తింపు ఇచ్చారని చర్చ జరుగుతోందిఈ ముగ్గురి ఎంపిక వెనుక ఉన్న అసలు వ్యూహం లోకేష్. పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. మొన్న పొలిట్ బ్యూరోతో పాటు అన్ని రకాల కార్యవర్గాల్లో యువతను నియమించారు. ఇప్పుడు రాజ్యసభలో సైతం ఈ ముగ్గురు యువ నాయకులను తీసుకున్నారు. పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ కీలక నియామకం చేపట్టారు. ఉత్తరాంధ్ర నుంచి విజయ్ ను తీసుకోవడం విశేషం. బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం, యువనేత కావడంతో చివరి నిమిషంలో ఆయన వైపు మొగ్గు చూపారు చంద్రబాబు. మొత్తానికి అయితే సుదీర్ఘ కసరత్తు తరువాత చంద్రబాబు రాజ్యసభ సభ్యులను ఎంపిక చేయడం విశేషం.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 08(భారత శక్తి) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, సోమవారం సాయంత్రం సారంగాపూర్ మండల కేంద్రం, యాకర్ పల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, ఇంకా పూర్తి చేయాల్సిన కొనుగోలు ఎంత ఉందో అడిగారు. ధాన్యం కొనుగోలు పూర్తయిన ఇతర ప్రాంతాల నుంచి హమాలీలను అదనంగా సమకూర్చుకొని ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు ధాన్యం కొనుగోలుపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, మిగిలిన ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియ తక్షణమే పూర్తి చేస్తామని అన్నారు.

అనంతరం ఖానాపూర్ మండల కేంద్రం, మస్కాపూర్ గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. మొత్తం కొనుగోలు వెంటనే పూర్తి చేయాలన్నారు.

ఈ తనిఖీలలో కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్ తహసిల్దార్లు విజయ కాంతారావు, సుజాత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 8 (భారత శక్తి):

ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు



ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యం వెంటనే తరలించాలి.

## -కొనుగోళ్లలో వేగం పెంచాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్.

## -వేములవాడ రూరల్ మండలం లింగంపల్లిలో కొనుగోలు కేంద్రంలో పరిశీలన

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 8:

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? ఎంత తరలించారో ఆరా తీశారు. ఈ సందర్భంగా వర్షానికి ధాన్యం తడువగా, జిల్లా కలెక్టర్ తేమ యంత్రంతో ధాన్యం తేమ శాతం పరిశీలించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ తో వెంటనే మాట్లాడి.. లారీలు సమకూర్చాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కొనుగోళ్లలో వేగం పెంచాలని, వెంట వెంటనే ధాన్యం తరలించాలని సూచించారు. కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు పంపాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం నిలువలకు అనుగుణంగా వాహనాలను సమకూర్చాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, తహసీల్దార్ అబూబాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 08 (భారత శక్తి) ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.



ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వినతిపత్రం అందజేత.

నిజామాబాద్, జూన్ 8(భారత్ శక్తి): ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామ సమస్యలను జిల్లా అధికారులకు ఉప సర్పంచ్ మూడ్ దయానంద్ విన్నవించారు. నిజామాబాద్ కలెక్టరెట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అయన బట్టాపూర్ గ్రామానికి విద్యుత్ లైన్ మెన్ ఏర్పాటు, సొసైటీ ద్వారా పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. అంతేకాకుండా ఏర్గట్ల మండలంలోని ఎనిమిది గ్రామాలలో ఒంటరి మహిళలకు, వితంతువులకు, వృద్దులకు, వికలాంగుల లతో పాటు బీడీ కార్మికులకు, గీత కార్మికులకు నూతన పెన్షన్ మంజూరు, పేదలకు రేషన్ కార్డులు కూడా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

## -గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం

## -జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 08(భారత శక్తి) జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.

గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం:జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్, జూన్ 08(భారత శక్తి):ప్రజా సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, పెండింగ్లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా సత్వరమే పరిష్కార మార్గాలను చూపాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అనిల్ కుమార్, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం పర్యవేక్షణలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా వినతులను స్వీకరిస్తూ వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన మొత్తం 170 దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశం



అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులు, ప్రతి ఒక్కరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం పొందాలని సూచించారు. వచ్చేవారం పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేసి పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో రికార్డు స్థాయిలో మక్కజొన్నలు, వరి ధాన్యం ఉత్పత్తి కాగా అందుకనుగుణంగా అధికారులు ఏర్పాటు చేసి తరలించడం జరిగిందని, అందుకోసం కృషిచేసిన, బాధ్యతాయుతంగా పనిచేసే ప్రతి ఒక్కరిని ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ)అదనపు కలెక్టర్ ఇంచార్జ్ స్థానిక సంస్థల పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# విదేశీ విద్య కోసం ఐఈఎల్టీఎస్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 08:(భారత శక్తి )తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో విదేశీ దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే మైనారిటీ విద్యార్థులకు ఐఈఎల్టీఎస్ (×జుఝా) పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి టి. దయానంద్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 100 మంది మైనారిటీ అభ్యర్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారశీలు తదితర మైనారిటీ వర్గాలకు చెందిన సాధారణ లేదా ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.

ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 15, 2026 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. నమోదు కోసం హైదరాబాద్లోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ కార్యాలయం, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రాంగణం, ఎంఏఎం క్యాంపస్, ఇంటర్మీడియట్ బోర్డు వెనుక, శ్రీ బాలాజీ ఎన్క్లేవ్, ఘోషా మహల్, నాంపల్లి వద్ద సంప్రదించాలన్నారు.

దరఖాస్తుదారులు ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్పోర్ట్ సైజు ఫొటోలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23236112 నంబర్ను లేదా ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్, జూన్ 8(భారత్ శక్తి): ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్ జడ్పీహెచ్ పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సర పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు చిన్ననాటి మిత్రులు, పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. తమ చిన్ననాటి మిత్రుడైన డాక్టర్ రవీందర్ ఆరోగ్య శాఖలో ఆర్మూర్ డివిజన్ జిల్లా ఉప వైద్యాధికారి స్థాయిలో ఉన్నందుకు చిన్ననాటి మిత్రులు అందరు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంగాసాగర్, గణేష్, నరేందర్, రాజారామ్ యాదవ్, ప్రభాకర్, నర్మదా అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



# చికెన్ వ్యర్థాలతో చేపల పెంపకం.. ఏపీ చెరువులకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 8: హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీ, అక్రమాలపై నిఘా ఉంచే హెచ్ ఫాస్ట్ పోలీసు బృందం తాజాగా ఒక భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న 9 లారీలను సీజ్ చేసి, సుమారు 120 టన్నుల వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అధికారిక రెండరింగ్ ప్లాంట్కు పంపించాల్సిన ఈ వ్యర్థాలను, నిందితులు దారి మళ్లించి ఆంధ్రప్రదేశ్లోని గుంటూరు, వినుకొండ, అద్దంకి, భీమవరంలోని చేపల చెరువులకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ చికెన్ వ్యర్థాలను అక్కడ చేపలకు ఆహారంగా వాడుతున్నారని, ఇలాంటి వ్యర్థాలను తిని పెరిగిన చేపలను మనుషులు ఆహారంగా తీసుకుంటే వారి ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదకరమని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**-అపరెల్ పార్క్, గోదాముల్లో అన్ లోడింగ్ వేగవంతంగా పూర్తి చేయాలి.**

**-ఎక్కడైనా తడిసిన ధాన్యం ఉంటే రైస్ మిల్లులకు తరలించాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**





భారత్ శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 8:

జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సోమవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అపరెల్ పార్క్, గోదాములకు ధాన్యం తరలించేందుకు అవసరమైన వాహనాలను సమకూర్చాలని, కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి అయిన కేంద్రాల నుంచి హమాలీలను అన్ లోడింగ్ కు వినియోగించాలని సూచించారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. వర్షంతో జిల్లాలో ఎక్కడైనా ధాన్యం తడిసి ఉంటే వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# భక్తులతో కిక్కిరిసిన వేములవాడ భీమేశ్వరాలయం

**-స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈవో రమాదేవి**

భారత శక్తి న్యూస్, వేములవాడ, జూన్ 8:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం కావడం, మరోవైపు వేసవి సెలవులు ముగుస్తుండటంతో ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ముందుగా భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి, అనంతరం కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో రుద్రాభిషేకం, అన్నపూజలు, నిత్య కళ్యాణం, చండీ హోమం, సత్యనారాయణ వ్రతం, మహాలింగార్చన వంటి వివిధ రకాల ప్రత్యేక పూజలు, మొక్కులు తీర్చుకున్నారు. గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో రమాదేవి స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోకుండా తక్షణమే క్లీన్ చేయించారు. దోమలు, ఈగలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ చల్లించి, ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా నీటితో కడిగించారు. అదేవిధంగా కోడె మొక్కుల లైన్లు, ఉచిత దర్శనం, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్లను స్వయంగా పరిశీలించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూశారు. వర్షం పడుతున్నప్పటికీ భక్తులకు సురక్షితమైన త్రాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. వేసవి ముగింపు, వర్షాల ప్రభావం ఉన్నప్పటికీ భక్తుల సౌకర్యార్థం ఆలయ సిబ్బందిని ఈవో నిరంతరం అలర్ట్ చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఈవో రమాదేవి వెంట డిఇఓ భాస్కర్ శర్మ, ఇతర ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుపైకి పొడుచుకొచ్చిన చెట్ల కొమ్మలు

**-ప్రమాదాలకు నిలయంగా మారిన మామిడిపల్లి, హన్మాజీపేట మార్గం.**



భారత శక్తి న్యూస్, వేములవాడ, జూన్ 8:

కోనరావుపేట మండలం మామిడిపల్లి, వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామాల మధ్య ప్రధాన రహదారి ప్రయాణికులకు నరకంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు విపరీతంగా పెరిగి రోడ్డుపైకి రావడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారిందని బావుసాయిపేట ఉపసర్పంచ్ తిక్కల నవీన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కూడా ఈ ప్రాంతంలో చెట్ల కొమ్మల వల్ల దారి కనిపించక పలువురు ప్రమాదాల బారిన పడ్డారని గుర్తుచేశారు. అయినా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. మళ్లీ అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకముందే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులకు రహదారి స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు.

# గుర్తు తెలియని మృత దేహం లభ్యం



భారత శక్తి న్యూస్, వేములవాడ, జూన్ 8:

వేములవాడ రూరల్ మండలం రుద్రవరం గ్రామం(పాత )మిడ్ మానేరు డ్యామ్ నందు ఒక గుర్తు తెలియని మగ శవం (వయసు 55-60 ఉంటుంది) కలదు. ఇట్టి మగ శవం కుళ్ళిన స్థితి లో కలదు. శవం షర్ట్, టవల్, డ్రాయర్ ధరించి వుంది. ఇట్టి గుర్తు తెలియని శవం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయటం జరుగుతుంది. ఇట్టి శవం ని సంబందీకులు ఎవరైనా గుర్తిస్తే వేములవాడ రూరల్ పోలీస్ వారికి సమాచారం అందించగలరు. ఫోన్ నెంబర్ 8712656417 సంప్రదించాలని కేసు ను దర్యాప్తు చేస్తున్న పోలీస్ లు తెలిపారు.

# అర్జీల పట్ల బాధ్యతాయుతంగా స్పందించాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**-అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించండి.**

వై ఎస్ ఆర్ కడప, జూన్ 8(భారత శక్తి ) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పట్ల బాధ్యతాయుతంగా స్పందిస్తూ అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు

సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ సమావేశపు హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈ వేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారం లో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. ముఖ్యంగా వేసవిలో ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు

బి.మఠం మండలం చెంచయ్య గారి పల్లెకు చెందిన జయరాం రెడ్డి.. మండలంలోని మల్లేపల్లి గ్రామ పరిధిలోని తన భూమిని ఆన్లైన్ రికార్డుల్లో ఎక్కించి పట్టాదారు పాసు పుస్తకాన్ని చేయించవలసిందిగా జిల్లా కలెక్టర్ వారిని కోరారు. వల్లూరు మండలం ఏ.ఓబాయపల్లె గ్రామానికి చెందిన భూమిక.. అదే గ్రామ పొలంలో సర్వే నెంబర్ 63/1, 64 లలోని తన భూమిని ఇతరుల పేరుతో ఆన్ లైన్ లో ఎక్కించుకొని తమపై దౌర్జన్యం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ ద్వారా విన్నవించుకున్నారు. ప్రొద్దుటూరు మండలం ఖాదరబాద్ కు చెందిన శశికళ.. తన కూతురు వై. భవ్యకు డిజేబుల్ సర్టిఫికెట్ కొత్తది తీసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ తెలియజేసారు. కడప మండలం అక్కాయ పల్లె కు చెందిన ఎం. దేవి తనకు ప్రభుత్వం నుంచి హౌసింగ్ పథకం ద్వారా ఇల్లు మంజూరు అయిందని, ఇంటి నిర్మాణం పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డి, జడ్పి సిఇఓ సుబ్రమణ్యం, డిఆర్డిఏ పిడి జి.రాజ్యలక్ష్మి, ఇన్చార్జి డిపిఓ వెంకటసుబ్బయ్య, ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాంధ్రతో ఆరోగ్య విప్లవం..!

**-జిల్లా వ్యాప్తంగా మొదలైన యోగాంధ్ర పక్షోత్సవాల సందడి**

**-10న ఫ్యామిలీ యోగా, 16న ప్రత్యేక యోగా శిక్షణలు**

**-జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కడప సిద్ధం**

వై ఎస్ ఆర్ కడప, జూన్ 8(భారత శక్తి ): శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అద్భుతమైన మార్గమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర క్యాంపెయిన్-2026' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా "యోగా" ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని, నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలకు "యోగా" ఒక దివ్య ఔషధంగా సమర్థవంతమైన పరిష్కారాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రతి పౌరుడు యోగాభ్యాసంలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. జిల్లాలో నాలుగు ప్రధాన కార్యక్రమాలతో యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జూన్ 7 -- ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం వద్ద యోగా ప్రదర్శన ను నిర్వహించామని తెలిపారు.

జూన్ 10 -- కడప రాజా రెడ్డి స్టేడియంలో "ఫ్యామిలీ యోగా"

జూన్ 16 -- గండికోటలో ప్రత్యేక యోగా ప్రదర్శన

జూన్ 21 -- రాజా రెడ్డి స్టేడియంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన వేడుక.

ఈ కార్యక్రమాల ద్వారా యోగా గొప్పతనాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు, ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ప్రత్యేక కమిటీలు

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాల సమర్థ నిర్వహణ కోసం జిల్లా, మండల, గ్రామ/వార్డు స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 26 మంది సభ్యులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైందన్నారు.

పోలీసు, విద్య, వైద్య ఆరోగ్య, క్రీడలు, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం, ఆర్టీసీ, ఎండోమెంట్స్, అటవీ శాఖల అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. కార్యక్రమాల నిర్వహణ, ప్రచారం, రవాణా, భద్రత, వైద్య సేవలు, తాగునీరు, ఫోటో-వీడియో కవరేజీ, పబ్లిసిటీ వంటి శాఖల అధికారులు యోగాంధ్ర జిల్లా కమిటీ సభ్యులు ఆయా శాఖలకు సంబంధించి కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారన్నారు.

యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని,

యోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదని శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే భారతీయ ఋషుల ఆరోగ్య జ్ఞానం నుండి ఉద్భవించిన అమూల్య సంపద అన్నారు. యోగా మన దిన చర్యలో భాగం అయితే కలిగే లాభాలను కూడా ఆయన తెలిపారు.

శరీరానికి సౌష్టవం, బలం పెరుగుతుంది

రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది

మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించడంలో తోడ్పడుతుంది

మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది

ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది

నిద్రలేమి సమస్యలు తగ్గుతాయి

గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది

పిల్లలు, యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

వృద్ధులకు శారీరక చురుకుదనం, మానసిక ఉల్లాసం లభిస్తుంది

యోగ పోటీలతో ప్రతిభకు ప్రోత్సాహం..

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా సోలో యోగా, ప్రాణాయామం, గ్రూప్ యోగా, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా వ్యాసరచన వంటి పోటీలను జిల్లా యంత్రాంగం నిర్వహించనున్నారు. విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

యాప్‌లో నమోదు చేసుకోండి...

యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలందరినీ యోగాభ్యాసం వైపు మళ్లించాలనికూడా జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

"యోగ జీవన విధానంగా మారాలి"..!

యోగాను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా.. ప్రతి కుటుంబం దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్ ద్వారా జిల్లాలో లక్షలాది మందికి యోగా చేరువై, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రతి ఇంట్లో యోగా ప్రతి మనిషికి ఆరోగ్యం" అనే లక్ష్యంతో యోగాంధ్ర క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# ప్రజావాణిలో ప్రజల నుండి 65 దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

మారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 08: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు.

జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు, అభ్యర్థనలకు సంబంధించిన దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా మొత్తం 65 దరఖాస్తులు వచ్చాయని,

అర్జీదారులు సమర్పించిన వినతులను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు



సూచించారు.

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎన్ వి గిరి, డీఆర్వో పాండు, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.

# పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, జూన్ 8: సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.



ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు.

చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అనుమతిలేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ డిమాండ్

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 8:

జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ పూజం కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ గుర్తింపు లేకుండానే నర్సరీ (శిశు) నుంచి 10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు లేని పాఠశాలలను నడపడం పూర్తిగా చట్టవిరుద్ధమన్నారు. ఇలాంటి అనుమతి లేని బడుల్లో చదివితే విద్యార్థులు భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని, గుర్తింపు లేని పాఠశాలలను తక్షణమే మూసివేయాలని కోరారు. అందులోని విద్యార్థులను ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఇతర పాఠశాలల్లో చేర్పించి న్యాయం చేయాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కార్తీక్ హెచ్చరించారు.



# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం - సమన్వయకర్తల సమావేశం

సంగారెడ్డి, భారత శక్తి, జూన్ 8:

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల సమన్వయ కర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించిన పార్టీ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇంచార్జి చంద్ర గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సభ్యత్వ నమోదు ఇంచార్జి చంద్ర గౌడ్ ని శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణపై సమన్వయ కర్తలతో విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. తప్పుడు హామీలు, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్లుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇంచార్జి చంద్ర గౌడ్ మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఈసారి డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వాలు



నమోదు చేసి పార్టీ బలాన్ని చాటాలని సూచించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి పట్టణ సమన్వయ కర్తలు హకీం, వెంకటేశ్వర్లు , విజేందర్ రెడ్డి డాక్టర్ శ్రీహరితో పాటు నలుగురు సభ్యులు, సంగారెడ్డి మండలం సమన్వయ కర్తలు చక్రపాణి తో పాటు నలుగురు సభ్యులు , కంది మండలం సమన్వయ కర్తలు మధుసూదన్ రెడ్డి, కొండల్ రెడ్డి తో పాటు ముగ్గురు, కొండాపూర్ సమన్వయ కర్తలు విఠల్ తో పాటు ఐదుగురు సభ్యులు , సదాశివపేట పట్టణ సమన్వయ కర్తలు చీల మల్లన్న, కోడూరు రమేష్ తో పాటు ముగ్గురు సభ్యులు, సదాశివపేట మండల సమన్వయ కర్తలు ఆంజనేయులు తో పాటు ఏడుగురు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి , మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పిటిసి మనోహర్ గౌడ్, సుధీర్ రెడ్డి, మల్లా గౌడ్ తదితరులు ఉన్నారు.

# క్రికెటర్ నెవిన్ మానిత్ ను అభినందించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

## - క్రికెట్ లో మరింతగా రాణించేందుకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని క్రికెటర్ మానిత్ కు హామీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 8:

సంగారెడ్డి పట్టణానికి చెందిన వర్ధమాన క్రికెటర్ నెవిన్ మానిత్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మానిత్ ప్రతిభను మానిత్ తండ్రి, కాంగ్రెస్ నాయకుడు, ఫిజియోథెరపిస్ట్ అయిన మధు ద్వారా తెలుసుకున్న ఆయన, భవిష్యత్తులో మంచి క్రికెటర్ గా ఎదగడానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మానిత్ ఇంకా మెరుగైన శిక్షణ పొందడానికి, వేర్వేరు టోర్నమెంట్లలో ఆడటానికి అయ్యే పూర్తి ఖర్చులను తానే భరిస్తానని జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో మరింత బాగా ఆడి సంగారెడ్డి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జగ్గారెడ్డి ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో రాణి స్తున్న 18 ఏళ్ల నవీన్ మానిత్ ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడు. చిన్నప్పటి నుండి క్రికెట్ మీద ఉన్న ఇష్టంతో కష్టపడి ఆడుతూ రాణిస్తున్నాడు.

:జాతీయ స్థాయి లో ప్రతిభ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తరపున 2024 లో బీహార్ (పాట్నా) లో జరిగిన అండర్-17 జాతీయ పోటీల్లో తెలంగాణ తరపున ఆడాడు. 2026 లో చండీగఢ్‌లో జరిగిన అండర్-19 జాతీయ పోటీల్లో కూడా పాల్గొని రాణించాడు.

వెంకటస్వామి గోల్డ్ కప్ సీనియర్ లీగ్‌లో మెదక్ జిల్లా తరపున ఆడుతూ మహబూబ్‌నగర్ జట్టుపై హాఫ్ సెంచరీ చేశాడు. ఢిల్లీలోని ఒక ప్రముఖ క్లబ్ తరపున ఆడుతూ అద్భుతమైన సెంచరీ చేశాడు

ప్రస్తుతం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లీగ్స్‌లో స్పోర్టి



క్లబ్ తరపున ı20, వన్డే, టూ-డే మ్యాచ్‌లు ఆడుతున్నాడు.

కోచ్‌ల శిక్షణలో రాటుదే.

ఆరవ తరగతి నుంచే ఎమ్మెస్ క్రికెట్ అకాడమీలో కోచ్ చంద్రమౌళి, ఇనాంల దగ్గర మానిత్ క్రికెట్ నేర్చుకున్నాడు. ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింతగా ఎదిగాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇక్బాల్ క్రికెట్ అకాడమీలో కోచ్ ఇక్బాల్ దగ్గర శిక్షణ పొందుతున్నాడు.. ఈ అభినందన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, మాజీ క్రికెటర్ రఘు తదితరులు పాల్గొని మానిత్‌ను అభినందించారు. జగ్గారెడ్డి ఇచ్చిన మద్దతుతో మానిత్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తంచేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి,భారత శక్తి, జూన్ 08: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.



ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో కలెక్టరేట్‌లో 27, సంగారెడ్డి డివిజన్‌లో 17, ఆందోల్ డివిజన్‌లో 5, నారాయణఖేడ్ డివిజన్‌లో 11, జహీరాబాద్ డివిజన్‌లో 10 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. అంతకుముందు, హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రయోజనాలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో దాని ప్రాధాన్యత, అలాగే అతిసార వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 8 (భారత శక్తి):

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని



నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన రాజు గౌడ్ తాను డిగ్రీ, పి జి డి సి ఏ, డి.ఈడి. పూర్తి చేశానని, గతంలో కంటి వెలుగు కార్యక్రమంలో పనిచేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. చెన్నూర్ మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన సైదల పద్మ తన ప్రజా పాలన వివరాలను దుగ్నేపల్లి గ్రామపంచాయతీ నుండి చెన్నూరు మున్సిపాలిటీకి మార్పు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన కదారి బీరయ్య తనకు గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉందని, ఊరిలోని అందరి ఇళ్ళ నుండి వచ్చే మురుగునీరు తన భూమిలోకి రావడంతో వ్యవసాయ సాగు చేయలేకపోతున్నానని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని సుభాష్ రోడ్ కు చెందిన జె.శాంతయ్య తాను సింగరేణి ఉద్యోగం చేసి పదవి విరమణ పొందానని, తాను కష్టార్జితంతో కొనుగోలు చేసిన ఇంటిని తన పెద్ద కుమారుడు ఆక్రమించుకున్నాడని, తన చిన్న కుమారునికి సింగరేణి ఉద్యోగం కల్పించానని, ప్రస్తుతం తన కుమారులు తన, తన భార్య బాగోగులు చూడడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భూపాలపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన బుర్ర లచ్చయ్య తన తండ్రి పేరిట జైపూర్ మండలం షెట్ పల్లి గ్రామ శివారులో భూమి ఉందని, ఆయన మరణానంతరం కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అంగడి రాములు తనకు గతంలో 88 శాతం దివ్యాంగత్వం నిర్ధారించబడి పింఛన్ మంజూరు అయిందని, ఇప్పుడు తక్కువ శాతంతో నిర్ధారించడంతో పింఛన్ ఆగిపోయిందని, నిరుపేద అయిన తన పరిస్థితి అర్థం చేసుకొని పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ ప్రాంతవాసులు తమ ప్రాంతంలోని రైల్వే గేట్ వెనక ఏర్పాటు చేస్తున్న బార్ కం రెస్టారెంట్ నివాస గృహాల మధ్యన రైల్వే ఫుడ్ ఓవర్ బ్రిడ్జికి అతి సమీపంలో ఉన్నందున అభ్యంతరాలు తెలుపుతున్నామని, బార్- రెస్టారెంట్ ఏర్పాటు నిలుపుదల చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పి డి ఎస్ యు ప్రతినిధులు తమ దరఖాస్తులో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల పట్టిక నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని కోరారు. చెన్నూర్ పట్టణంలోని పద్మ నగర్ కు చెందిన తన్నీరు ప్రమీల నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# వానాకాలం వ్యవసాయ సాగుకు ముందస్తు కార్యచరణ: కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 8 (భారత శక్తి):



రాబోయే వానాకాలం వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తో కలిసి జిల్లా వ్యవసాయ శాఖ సహాయ అధికారులు, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ నివేదిక ప్రకారం జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో గత 5-6 సంవత్సరాలతో పోలిస్తే సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎల్-నినో ప్రభావం కారణంగా వాతావరణంలో వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పంటల వైవిధ్యీకరణ, మిశ్రమ, స్వల్పకాలిక పంటల సాగు, వంటి ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా అవగాహన కల్పించాలని, విత్తనాలు వేసే ముందు కనీసం 3 నుండి 4 రోజుల పాటు వర్షాలు కురిసి, భూమిలో ఒకటి నుండి ఒకటిన్నర అడుగుల లోతు వరకు తగిన తేమ ఉన్న తర్వాతే విత్తనాలు విత్తాలని రైతులకు సూచనలు అందించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు మొక్కజొన్న సాగును ప్రోత్సహించాలని, పంట అవశేషాలను పొలాలలో తగులబెట్టే చర్యలను పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పంట అవశేషాల దహనం వల్ల వాయు కాలుష్యం పెరగడం, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడటమే కాకుండా నేలలో సారం తగ్గిపోవడం వంటి అనేక నష్టాలు కలుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పొలాలలో పంట అవశేషాలను తగులబెట్టే రైతులపై గ్రామపంచాయతీల ద్వారా 2 వేల 500 రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు జరిమానా విధించబడుతుందని, జరిమానా చెల్లించని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యానికి టోకెన్ల జారీని నిలిపివేసే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్-నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు 08 రకాల సన్న ధాన్యం సాగు చేసేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. రసాయన వ్యవసాయం నుండి సహజ, సేంద్రియ వ్యవసాయానికి రైతులను మళ్లించే లక్ష్యంతో అమలు చేస్తున్న లిజాతీయ సహజ వ్యవసాయ మిషన్‌లి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 17 క్లస్టర్లలో ప్రతి క్లస్టర్‌కు 125 మంది రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ అందించి, దశల వారీగా సహజ వ్యవసాయ విధానాల వైపు మళ్లించాలని, నానో యూరియా వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాబోయే 10 రోజుల పాటు వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా గ్రామాల వారీగా పర్యటించి రైతులతో సమావేశాలు నిర్వహించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన సాగు పద్ధతులు, పంటల ఎంపిక, నీటి వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి మండలంలో రైతు నమోదు కార్యక్రమ నిర్వహణను క్రమబద్ధంగా చేపట్టి, గ్రామ పర్యటనల అనంతరం నివేదికలను సమర్పించాలని తెలిపారు. వానాకాలం సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ - తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 8:



ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 4, డీపీఓ 3, మున్సిపాలిటీ 3 మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 77 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పి డి సన్యాసయ, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ ,స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ ప్రభుత్వ స్థలము డంపింగ్ యార్డుకు కేటాయింపు రద్దు చేయాలి: సర్పంచ్ పుష్పలత




జగిత్యాల, జూన్ 8 (భారత శక్తి ప్రతినిధి):

ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలోని సర్వే నెం. 266లో గల ప్రభుత్వ స్థలాన్ని మున్సిపాలిటీ డంపింగ్ యార్డు కోసం కేటాయించిన ఉత్తర్వులను రద్దు చేసి, ఆ స్థలాన్ని గ్రామపంచాయతీ ఆధీనంలోనే కొనసాగించాలని తిమ్మాపూర్ సర్పంచ్ నల్లమాస పుష్పలత వైకుంఠం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామసభ నిర్వహించకుండా, ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. ప్రతిపాదిత స్థలానికి సమీపంలో గండి హనుమాన్ దేవాలయం ఉండటంతో డంపింగ్ యార్డు వల్ల కాలుష్యం, దుర్వాసనలు, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. గతంలో ఇదే స్థలాన్ని క్రీడా ప్రాంగణం కోసం గ్రామపంచాయతీకి కేటాయించి ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. గ్రామ యువత, విద్యార్థుల క్రీడా అవసరాలను దృష్టిలో ఉంచుకొని డంపింగ్ యార్డు కేటాయింపును వెంటనే రద్దు చేయాలని ఆమె కోరారు.

# మంచిర్యాల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎండి ఖాదర్

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 8 (భారత శక్తి):



మంచిర్యాల మండల నూతన తహశీల్దార్ (ఎమ్మార్వో)గా మహ్మద్ ఖాదర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రజా సౌలభ్యం మేరకు లక్ష మందికి ఎమ్మార్వో సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ నియామకం ద్వారా, మంచిర్యాల జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగామండల పరిధిలోని ప్రజలకు, ముఖ్యంగా రైతులకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ సమస్యలు, పెండింగ్ అప్లికేషన్లు,ఇతర సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి

జగిత్యాల, జూన్ 8 (భారత శక్తి ప్రతినిధి):



తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మపురి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వేముల నాగలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రిలోని ల్యాబ్‌లు, వైద్యుల హాజరు, వైద్య పరికరాలు, మందుల నిల్వలు, సిబ్బంది పనితీరును పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సరైన వైద్యం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు సంగనబట్ల సంతోషిని, చిపిరిశెట్టి రాజేష్, సంగి ఆనంద్, కొమురవెల్లి పవన్, జంజీరికాని సువర్ణ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్.కే. షౌకత్, సుల్తానా, అశెట్టి మమత, దేవాలయ మాజీ చైర్మన్ జక్కు రవీందర్,ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పోరాడే నాయకులకే బీఆర్‌ఎస్‌లో ప్రాధాన్యం: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, జూన్ 8 (భారత శక్తి ప్రతినిధి):



కార్యకర్తలు, పార్టీ కోసం నిలబడి పోరాడే నాయకులకే బీఆర్ఎస్ పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని, అధికారం కోసం పార్టీలు మారే నాయకులకు స్థానం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం ధర్మపురి నియోజకవర్గ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విస్తృత స్థాయి సమావేశం, ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపిస్తూ, వాటికి భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ లీగల్ సెల్‌తో పాటు తాను కూడా అండగా ఉంటానన్నారు. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను వంచించిందని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యాలు, కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మూల విజయరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, ఓరగంటి రమణారావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మాధవరావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే పాలన.. సభల ద్వారా తక్షణ ఊరట: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 8 (భారత శక్తి):ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31, 32 డివిజన్లకు సంబంధించి లక్ష్మీ గార్డెన్స్ లో నిర్వహించిన డివిజన్ సభకు డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, 31వ డివిజన్ కార్పొరేటర్ సంపత్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక గ్రామ/డివిజన్/వార్డు సభలు నిర్వహించి, పారిశుధ్యం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ,అరైవ్- అలైవ్, ఇందిరమ్మ ఇండ్లు,సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని,తడి చెత్త, పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వేరువేరుగా సేకరించి నిర్వీర్యం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని,వర్షం వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ కాకుండా ఉంటుందని తెలిపారు.ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని,బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాల అందజేత, స్వీకరణ, చనిపోయిన, డబుల్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్- అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, గత సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకం కూడా అందించడం జరుగుతుందని, జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసిల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు.డిసిపి మాట్లాడుతూ ప్రజలందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాలికల సంరక్షణ కొరకు షీ టీం సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని, తెలిసిన వాళ్ళు ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగించినట్లు సమాచారం ఇస్తే వారిని డి-అడిక్షన్ సెంటర్ కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే 100 నెంబర్ కు డయల్ చేసి వెంటనే సమాచారం అందించడం ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ మాట్లాడుతూ "మంచిర్యాల శుభ్రత- ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత" నినాదంతో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, వీధి దీపాలు, రోడ్ల మరమ్మత్తులు, త్రాగునీటి సదుపాయం, మురుగు కాలువల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజాపాలన ద్వారా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని, ఎలాంటి అవినీతి, దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల సంబంధిత ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేశారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పించాలి

జగిత్యాల, జూన్ 8 (భారత శక్తి ప్రతినిధి):



జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా శాఖ నాయకులు సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్, జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఈవో రాముకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అనేక మంది జర్నలిస్టులు తమ పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించేందుకు ప్రైవేట్ విద్యాసంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.సమస్యపై వెంటనే స్పందించిన అదనపు కలెక్టర్ రాజా గౌడ్‌కు యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల్ చారి, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్రశేఖర్, చింత నరేష్, సభ్యులు రాజిరెడ్డి, గాండ్ల వేణు, మనోజ్, జగిత్యాల టౌన్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు శనిగారపు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి నారాయణరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు అలిశెట్టి మదన్ మోహన్, లక్ష్మారెడ్డి, బుర్ర సత్యనారాయణ గౌడ్, క్రాంతి, రాజు నాయక్, భూషణం, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252,
Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy